క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని పాలోది గ్రామ సమీపంలో గుట్టపై వెలిసిన శ్రీ సీతా రాముల ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పాలోది గ్రామస్తులు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంపీ నివాసంలో ఎంపీని కలిసి వినతిపత్రం అందించారు. గుట్టపై షెడ్డు నిర్మాణంతో పాటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కప్పర్ల మాజీ సర్పంచ్ సదానంద్, గ్రామ పెద్దలు కళ్లెం నాగారెడ్డి, సతీశ్ రెడ్డి, శంకర్, అరుణ్, సంతోశ్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక


కమిటీని ప్రకటిస్తున్న రహీల్‌ఖాన్

బేల: మండల కేంద్రంలో ఆదివారం మండల జాతీయ మానవ హక్కుల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా లోహట్ అర్జున్, ప్రధాన కార్యదర్శిగా గుండవార్ అకాష్, కోఆర్డినేటర్‌గా గోరే విశాల్, సభ్యులుగా ప్రభాకర్, బొజ్జ ఉషన్న, అగార్కర్ అకాష్, దొహర్కర్ దీపక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రహీల్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కమిటీ సభ్యులు ప్రజా సమస్యలు, అవినీతిపై పోరాడాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదల ప్రజలకు అందేవిధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మారప గంగారాం, కొమ్మువార్ సాగర్, ఉప్పల్‌వార్ కార్తీక్, జాబాడే మనోహర్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని పర్కోట చెరువు కట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని ఆదివారం పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. పిన్నమవార్ శ్రీనివాస్, కుత్రేకర్ రాకేశ్, నాంపల్లి సంతోష్ కుమార్, ఖాలిద్ అలీ, కావకే రవీందర్, కుత్రేకర్ ఈశ్వర్ దాస్, పిన్నమవార్ సంతోష్ పేకాట ఆడుతుండగా పక్కా సమాచారం మేరకు దాడిచేసి వారి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు, రూ.13,050 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయండి


ఎమ్మెల్యేని కలిసిన గ్రామస్తులు

జైనథ్: కాలం మారింది.. కాలంతో పాటు మనిషి మారుతున్నాడు. సెల్‌ఫోన్ లేనిదే అడుగు కూడా బయటపెట్టడం లేదు. అయినా.. కొన్ని గ్రామాలకు టవర్ సిగ్నల్ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని పిప్పల్‌గావ్ గ్రామంలో సిగ్నల్ సరిగా రాకపోవడంతో ఆదివారం మొబైల్ టవర్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే పాయల శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో వెంటనే మొబైల్ టవర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిట్యాల భూమన్న, సంతోష్, సాయి, గణేష్, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

'పీఏసీఎస్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి పీఏసీఎస్‌లో అక్రమాలకు పాల్పడ్డ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి.. కాజేసిన నిధులను రికవరీ చేయాలని సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసి) ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రూ.రెండు కోట్ల మేర నిధుల దుర్వినియోగంపై త్రీమెన్ కమిటీ విచారణ నిష్పక్షపాతంగా వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గతంలో పని చేసిన సీఈవో అక్రమాలకు పాల్పడినట్లు సంఘం డైరెక్టర్లు ఆధారాలతో ఫిర్యాదు చేసిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. చైర్మన్, సీఈవోల అవినీతిని బహిర్గతం చేసి రెవెన్యూ రికవరీ యాక్టు ద్వారా రైతుల సొమ్ము వసూలు చేయాలని కోరారు. చర్యలు తీసుకోకుంటే తమ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ డివిజన్ నాయకులు దుర్గం లింగన్న తదితరులున్నారు.

సమస్యల్లో విలీన కాలనీలు


తిరుమలనగర్‌లో నిలిచిన మురుగునీరు

- జాడలేని డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణాలు
- అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న ఎంప్లాయీస్ కాలనీ, తిరుమలనగర్ వాసులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని విలీనకాలనీలపై బల్దియా యంత్రాంగం శీతకన్ను వేస్తోంది. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ విలీన కాలనీల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇందుకు పట్టణంలోని తిరుమలనగర్, ఎంప్లాయీస్ కాలనీలే నిదర్శనంగా చెప్పవచ్చు. ఆయా కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. రోడ్లు, డ్రెయినేజీల వంటి కనీస మౌలిక వసతులు సమకూరడం లేదు. దీంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ అధికారులతో పాటు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకునేవారు లేరని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పట్టపగలు వెలుగుతున్న వీధిదీపాలు

అన్ని సమస్యలే..

మావల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగిన సుభాష్‌నగర్ గతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికలకు ముందు ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో విలీనమైంది. ప్రస్తుతం పట్టణంలో 13వార్డుగా కొనసాగుతోంది. దీని పరిధిలోకి వచ్చే ఎంప్లాయీస్ కాలనీ, తిరుమలనగర్ కాలనీల్లో అన్ని సమస్యలే రాజ్యమేలుతున్నాయి. డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతోంది. వర్షాకాలం నీరు నిలిచి ఈగలు, దోమలు వృద్ధికి అవాసాలుగా మారుతున్నాయి. కాలనీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలు సైతం జరగడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. వీధి దీపాలు వెలుగకపోగా, వాటి నిర్వహణ కొరవడటంతో మరికొన్ని చోట్ల 24 గంటల పాటు వెలుగుతూనే ఉన్నాయి. చెత్త సేకరణకు వాహనాలు రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చొరవ చూపి సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



రోడ్లు , డ్రెయినేజీలు లేక పోవడంతో ఇబ్బంది పడుతున్నాం. మురుగునీరు రోడ్లపైనే పారడంతో పాటు ఖాళీ ప్లాట్లలో నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షాలు కురుస్తుండటంతో రోగాలు ప్రబలే అవకాశం లేకపోలేదు. చెత్త తరలింపునకు కనీసం చెత్తబండి కూడా కాలనీకి రావడం లేదు.
– కొప్పుల దేవిదాస్, తిరుమలనగర్

సౌకర్యాలు కల్పించాలి



రోడ్లు, డ్రెయినేజీలు వంటి ఎలాంటి వసతులు కల్పించడం లేదు. రోడ్లన్నీ మట్టితో కూడినవే ఉన్నాయి. ప్రతీ ఏటా ఇంటికి రూ.వెయ్యి చొప్పున జమ చేసి మొరం వేసుకుంటున్నాం. ఈఏడాది మొరం కోసం బల్దియా అధికారులు రూ.5లక్షలు మంజూరు చేసినా.. ఇప్పటి వరకు మొరం వేయలేదు. అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలి. – ఏనుగు విలాస్‌రెడ్డి, ఎంప్లాయీస్‌కాలనీ అధ్యక్షుడు

గ్రామాభివృద్ధికి కృషి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని కొరటికల్ హనుమాన్ ఆలయం ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. నిత్యం ఆలయాల్లో పూజా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ జహీర్, మండల కన్వీనర్ శివారెడ్డి, శ్రీను, ప్రతాప్, దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- కొరిటికల్(బి) గ్రామానికి చెందిన బొంత ఎల్లన్న కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.
- లింగట్ల గ్రామ పంచాయతీ పరిధిలో గల గోందుగూడ, నంద్యానాయక్‌తండా గ్రామాల్లో కమ్యూనిటీ హాల్, పాఠశాల ప్రహరీ నిర్మాణాలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.
- పీచర గ్రామానికి చెందిన యువకుడు సోమేశ్ ఆధ్వర్యంలో పీచర, గుత్పాల, రోల్‌మామడ, రేంగన్‌వాడి, పిప్రి, మంగలమోట, ఎల్లమ్మగూడ, గొదుమల్లు, దన్నూర్ గ్రామాలకు చెందిన ఆదివాసీ యువకులు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రజలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాత్నాల: ప్రజలకు అండగా ఉంటానని, సమస్యల పరిష్కారానికి బీజేపీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నూతనంగా ఏర్పడిన సాత్నాల మండలంలో బీజేపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆదరించినట్లే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని ఆదరించాలని కోరారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉంటూ, వారి సమస్యలు తెలుసుకొని, పరిష్కారం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లోక కరుణాకర్ రెడ్డి, అశోక్ రెడ్డి, అస్తక్ సుభాష్, పోతురాజు రమేశ్, సురేశ్, పంద్రా రాము, రాథోడ్ రోహిదాస్, కుంచాల మహేందర్, దొడ సంతోష్, అశోక్, తిరుపతి, రేణుక భాయ్, అంబారావు పాల్గొన్నారు.


రిబ్బన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

దిగుబడిపైనే ఆశలు..!


దర్మంపురిలో ఏపుగా పెరిగిన సోయా

- పూత, కాత దశలో సోయా
- ఆశాజనకంగా పంట

ఇచ్చోడ: ఈ ఏడాది ఖరీఫ్‌లో సోయా పంటపై రైతులు ఆశలు చిగురిస్తున్నాయి, గత నాలుగేళ్ల నుంచి సరైన దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. దీంతో సోయా రైతులు ఆసక్తి చూపక పోవడంతో సాగు క్రమంగా తగ్గుతూ.. వచ్చింది. కానీ ఈ ఏడాది ఖరీఫ్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా 30 వేల ఎకరాల వరకు సోయా సాగు చేస్తున్నారు. గతేడాది కన్న ఈ ఏడాది పంట ఏపుగా పెరిగి కాతపూత దశలో ఉంది. దీంతో సోయా పంటపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఏపుగా పెరిగిన మొక్కలు..

గత 20 సంవత్సరాల క్రితం ఇక్కడి ప్రాంతంలో సోయా పంటను సాగు చేయడం ప్రారంభించారు. మొదట్లో ఎకరానికి సోయా 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. రానురాను సోయా పంట దిగుబడులు తగ్గుతూ.. వచ్చాయి. గత నాలుగేళ్ల నుంచి దిగుబడులు 4, 5 క్వింటాళ్లకు పడిపోయాయి. అయినా.. పత్తికి ప్రత్యామ్నాయం లేక పోవడంతో సోయా పంటను సాగు చేస్తూనే ఉన్నారు. ఏపుగా పెరిగిన సోయా పంటల ఆధారంగా ఈ ఏడాది ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అంచనా వేస్తున్నారు.

నెల రోజుల్లో కోతకు..

ప్రసుతం పూత, కాత దశలో ఉన్న సోయా మరో నెల రోజుల్లో కోతకు రానుంది. కోత సమయంలో వర్షాలు అనుకూలిస్తే రైతులకు ఇబ్బంది లేకుండా పంటలు ఇంటికి వస్తాయి. అలాగే దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉంది.

20 ఎకరాల్లో సాగు



ఈ ఏడాది 20 ఎకరాల్లో సోయా సాగు చేస్తున్న. ఆశించిన స్థాయి కంటే ఏపుగా పెరిగింది. గతేడాదిలో సోయా పంటకు చీడ పురుగుల బెడద కుడా ఎక్కువే ఉండే. ఈ ఏడాది పంట విత్తుకున్న నాటి నుంచి సోయాకు చీడపురుగుల బెడద కూడా తక్కువగానే ఉంది.
మహేందర్, తలమద్రి, ఇచ్చోడ మండలం

దిగుబడి పెరిగే అవకాశం



ఈ ఏడాది సోయా పంట 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గత నాలుగేళ్ల నుంచి ఐదు క్వింటాళ్ల కన్న ఎక్కువ దిగుబడులు రాలేదు. ఆశించిన స్థాయిలో పంట పెరగడంతో దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.
– బక్రి గోపాల్, గోకండ, బజార్‌హత్నూర్



సాత్నాల: భోరజ్ మండలం సావాపూర్ గ్రామంలో సమాధులు, చెట్ల మధ్య క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. గ్రామీణా క్రీడాకారుల్లో ఉన్న దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో, తీర్చిదిద్దాలని ఉద్దేశంతో క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. ఊరికి దూరంగా ఏర్పాటు చేయడంతో క్రీడకారులు ఆటలు ఆడడం లేదు. దీంతో క్రీడా మైదానాలు నిరుపయోగంగా మారాయి.



సాత్నాల: భోరజ్ మండలం రాంపూర్ గ్రామంలో పంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మరమ్మతులకు నోచుకోకపోవడంతో, భవనం గోడలు పగుళ్లు తేలాయి. వర్షం వచ్చినప్పుడు ఉరుస్తుంది. దీంతో పంచాయతీ సిబ్బంది భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో పంచాయతీ భవనం మంజూరైనా.. నిర్మాణం చేయలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపైనే వరద


రహదారిపై నిలిచిన నీరు

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ టు ఆసిఫాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై మండలంలోని లాల్‌టేకిడి సమీపంలోని హీరాపూర్ వద్ద రోడ్డుపై వరదనీరు నిలిచిపోతోంది. దీంతో ఆ ప్రాంతం గుంతలమయంగా మారుతుంది. ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతునా.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

రెచ్చిపోతున్న వీధి కుక్కలు

- చిన్నారులు, వృద్ధులపై దాడులు
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండలాల్లో కుక్కల బెడద పెరిగింది. కుక్కల సంఖ్య పెరిగిపోవడంతో ఎక్కడ బడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తూ.. ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. బయటకు వెళ్లాలన్నా.. జంకుతున్నారు. రాత్రి సమయంలో వెంటపడి తరుముతున్నాయి. ఇటు పట్టణ కేంద్రంలోనే కాకుండా గ్రామాల్లో సైతం రెచ్చిపోతున్నాయి. కుక్కలు దాడి చేసి గాయపరిచినా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని చర్యలు చేపట్టాలని ప్రజలు కోరతున్నారు.

గతంలో జరిగిన ఘటనలు..

మండలంలోని సాలెవాడ(బి) పంచాయతీ పరిధిలోని తాండ్ర గ్రామానికి చెందిన కర్తార్‌సింగ్ గత కొన్ని సంవత్సరాల క్రితం పిచ్చికుక్క కరవడంతో 14 రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇంట్లో రాత్రి పడుకొని ఉన్న సమయంలో పిచ్చికుక్క దాడి చేసి కరిచింది. అదే గ్రామానికి చెందిన జ్యోతిరాంతో పాటు ఒక ఆవు, ఒక దూడను కరిచింది. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


ఉట్నూర్ పట్టణంలో సంచరిస్తున్న శునకాలు

వసతిగృహం ఆవరణలో పిచ్చిమొక్కలు


పెరిగిన పిచ్చిమొక్కలు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. వసతి గృహం ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగాయి. దీంతో 80 మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాములు సంచరిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వసతి గృహం నిర్వాహకులు దృష్టి సారించి పిచ్చిమొక్కలు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రకృతి ప్రేమికులు


మొక్కలు పెంచుతున్న కానిస్టేబుల్ దుర్వ సంతోష్


ఇంటి ఆవరణలో పెంచుతున్న పూల మొక్కలు

- మినీపార్కును తలపిస్తున్న ఇల్లు
- సుమారు 500 మొక్కలు నాటి సంరక్షణ

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన దుర్వ యేశ్వంత్‌రావ్ కుటుంబసభ్యులందరూ ప్రకృతి ప్రేమికులే. ఇంటి ఆవరణలో సుమారు 500 పైగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. దీంతో ఆ ఇల్లు మినీ పార్కుల దర్శనమిస్తుంది. తండ్రి దుర్వ యేశ్వంత్‌రావ్ సెరికల్చర్ శాఖలో టెక్నికల్ అసిస్టెంట్‌గా, కొడుకులు దుర్వ రమణ, దుర్వ సంతోష్, దుర్వ సంజీవ్ ముగ్గురు పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సంతోష్ భార్య రజిని అటవీశాఖలో ఎఫ్‌బీవోగా విధులు నిర్వహిస్తూ ఉమ్మడి కుటుంబంగా నివాసిస్తున్నారు. ప్రకృతిపై తమకున్న ప్రేమతో 2016 నుంచి వివిధ ప్రాంతాల్లో దొరికే అరుదైన మొక్కలను తీసుకువచ్చి ఇంటి ఆవరణలో పెంచి అందరికీ ఆదర్శిస్తున్నారు. ఇంట్లో ఎక్కడ చూసినా.. పచ్చదనం దర్శనమిస్తోంది.

మొక్కలను సంరక్షిస్తున్నాం



మా ఇంట్లో కుటుంబ సభ్యులకు ప్రకృతిపై ప్రేమ ఎక్కువ. ప్రకృతిపై ఉన్న ప్రేమతో విధి నిర్వహణలో ఏ ప్రాంతానికి వెళ్లినా.. అరుదైన మొక్కలు, పూల మొక్కలు కనిపిస్తే తీసుకువచ్చి ఇంటి ఆవరణలో నాటి సంరక్షిస్తున్నాం. ఇంట్లో నాటిన ప్రతి మొక్కను రక్షించడానికి కుటుంబ సభ్యులం కలిసి కృషి చేస్తున్నాం. – దుర్వ సంతోష్, కానిస్టేబుల్